# ఇజాలు-నిజాలు

నలభై ఐదేళ్ళ క్రితం, అంటే నేను చదువుకునేటప్పుడు తెలుగులోకి అనువాదం చేసిన శరత్ నవలలు దాదాపు అన్నీ చదివాను. అనువాదాలు చేసినవారిలో ఆ పుస్తకాలు ప్రచురించినవారిలో, నాకు బాగా నచ్చినవారూ, ఇంకా పేర్లు గుర్తున్నవారూ, బొందలపాటి శివరామకృష్ణ, శకుంతలాదేవి.

శ్రీకాంత్, బడదీది, దేవదాసు, పరిణీత, చరిత్రహీనులు మొదలైనవి నాకు బాగా నచ్చిన నవలలు. అప్పటినించీ చక్కటి సాహిత్యం ఏ భాషలోనించి దిగుమతి అయినా వెంటనే చదివేయటం అలవాటయిపోయింది. గుంటూరు అరండల్‌పేట తొమ్మిదో లైన్లో మా ఇంటి పక్కనే ఒక పెద్ద లైబ్రరీ వుండటంతో, నా సాహిత్యశోధనకి అసలు అడ్డమే రాలేదు. సోమర్‌సెట్ మామ్, టాల్‌స్టాయ్, జూల్స్ వెర్న్, ముల్క్‌రాజ్ ఆనంద్, తకళి శివశంకర పిళ్ళై, శ్రీకంఠమూర్తి... ఇలా ఎన్నో ఇతర భాషా రచయితల పుస్తకాలు చదివే అవకాశం కలిగింది. సాహిత్యానికి ఎల్లలంటూ లేవనీ, మంచి సాహిత్యం ఎక్కడున్నా, ఏ భాషలో వ్రాసినా, ఆ పరిమళాలు అలా గుబాళిస్తూనే వుంటాయనీ తెలుసుకున్నాను.

అలాటి సాహిత్యం ఆంధ్రదేశంలో నెమ్మదిగా నిజాలనించి దూరమవుతూ ఇజాల పంజాలో చిక్కుకున్నది. ఆ ఇజాల మీద సరియైన అవగాహన వుండటం, అది ఒక బాధ్యతగా తీసుకుని రచనలు చేయటం చాలమంది రచయితలలో జరిగింది. అది మంచిదే. కానీ కొంతమంది రచయితలు మాత్రం ఈ ఇజాలని నిజాల మీద ద్వేషంగా మార్చుకుని రచనలు చేసే పరిస్థితిని తీసుకువచ్చారు. రకరకాల రాజకీయాల పరంగా, ఇజాల ముసుగులు కప్పుకుని, నిజాలని నట్టేట ముంచేసి, కేవలం స్వప్రయోజనాల కోసం ఈ రచనలు చేసి సాహిత్యాన్ని ఇంకెటో నడిపించారు. దానితో భజనలు, విభజనలు, తమ ఇజానికి చెందని జనాన్ని భోజనాలు చేయటం మొదలయాయి. అంటే మనకి నచ్చిన వాటిని మెచ్చుకునే బదులు, మనకి నచ్చని వాటిని ద్వేషించే ఆలోచనలు ఈ వాదాల విషరూపంలో అవతారం దాల్చాయన్న మాట. కమ్యూనిష్టు వాదం, స్త్రీవాదం, దళితవాదం, ప్రాంతీయవాదం, కులవాదం, మతవాదం ఇలా ఎన్నో... ఎన్నెన్నో...

ఒక ప్రయోజనం గురించి వ్రాసే రచనలు యుగాల తరబడి ప్రపంచ సాహిత్యంలోనూ తెలుగు సాహిత్యంలోవున్నవే. తెలుగులోగురజాడ అప్పారావ్ ఉన్నవ లక్షీనారాయణ, చలం, వీరేశలింగం.. ఇలాటి మహామహుల రచనలెన్నో వున్నాయి. సమాజంలోని అవకతవకలనీ మూఢనమ్మకాలనీ వేలెత్తి చూపించాయి. అవి చదివిన ప్రజలుకూడా వారి రచనలకి ఎంతో స్పందించారు. కానీ ఆ రచయిత

లెవ్వరూ మాంసం తింటున్నాం కదా అని ఎముకలు మెళ్ళో వేసుకుని తిరగలేదు. కమ్యూనిష్టు అనబడే శ్రీశ్రీ కూడా మహాప్రస్థానంలాటి గొప్ప కవిత్వాన్ని ఎలా వ్రాసేరని అడిగితే, నేను రాయలేదు ఆకలేసి కేకలేశానన్నాడు. అవి స్పందనతో చేసిన రచనలు. అందుకే అన్ని దశాబ్దాలుగా సజీవంగా వున్నాయి. రావిశాస్త్రి, బీనా దేవి, కందుకూరి ఇలా ఎందరో మంచి సాహిత్యం, వాస్తవాన్ని వాస్తవంగా చిత్రిస్తూ వ్రాశారు.

బ్రాహ్మణత్వంలోని మూఢాచారాలని విమర్శించిన గురజాడ బ్రాహ్మణుడు. పురుషుల అహంకారానికి గురయిన స్త్రీజాతిని నిద్ర లేవమని చెప్పిన చలం మగవాడు. సమాజంలోని అగ్రజాతి అంటరానితనాన్ని కాదన్న ఉన్నవ లక్ష్మీనారాయణ ఆ అగ్రజాతివాడే.

ధనవంతుల్ని చంపేస్తే పేదవాళ్ళు బాగుపడరు. మార్చవలసింది ఆ వ్యవస్థని. మగవాళ్ళని నరికేస్తే ఆడవాళ్ళు సుఖంగా వుండరు. మార్చవలసింది ఆ అసమానతని. పెద్ద కులాలవారిని అణిచేస్తే దళితుల జీవితాలు బాగుపడవు. మార్చవలసింది ఆ అంతరాలని. ఒక ప్రాంతం వాళ్ళని అంధుల్ని చేస్తే ఇంకో ప్రాంతం వారి జీవితాలు బాగుపడవు. ఇక్కడ కావలసింది సమ సమాజ నవ నిర్మాణం.

మన తెలుగు సాహిత్యం అరసాల విరసాల్లో చిక్కుకుని చివరికి సరసాలపాలయింది ఈ రోజు.

"నా ఇజమే నాకు నిజం" అనే పరిస్థితికి దిగజారిపోయింది సాహిత్యం.

కొన్ని కథల పుస్తకాల సంగతి కూడా ఇక్కడ చెప్పాలి. ఆ సంవత్సరంలో వచ్చిన మంచి కథలని ఒక పుస్తకరూపంలో ప్రచురించే వారిని, వారి "ఇజం" ఒక రకమైన కథలని మాత్రమే ఎన్నుకునే స్థాయికి దిగజార్చేసింది. వారికి అవే మంచి కథలు.

అలాగే ఈ శతాబ్దంలో వచ్చిన వంద మంచి కథలు అంటాడింకో ఆయన ఒక లిస్ట్ ప్రచురించి. ఆయనకి మాత్రమే నచ్చిన కథలు కనుక "ఈ శతాబ్దంలో నాకు నచ్చిన వంద కథలు" అంటే బాగుంటుంది కదా. ఆయన ఇజం ఆయనది.

ఆ మధ్య బాపుగారు నాకు ఉత్తరం వ్రాస్తూ, సరదాగా ఒక విషయం ప్రస్తావించారు. అశోకుడు కత్తి, డాలుతో గుర్రం మీద వెడుతుంటే - దారి పక్కన ఒక బిచ్చగాడు "నేనే నీలా చక్రవర్తి స్థానంలోవుంటే ఇంతటి రక్తపాతాన్ని కలిగించి వుండేవాణ్ణి కాదు" అన్నాట్ట.

చక్రవర్తి "నేను నీలాగా ఒక బిచ్చగాణ్ణి అయివుంటే, అసలు యుద్ధం సంగతి నా ఆలోచనకే వచ్చి వుండేది కాదు" అన్నాట్ట.

కొంతమందికి ఇజాలు సహజమైనా, నిజాల కోణాలనించీ చూడటం నిజంగా మంచిది.

మనకి స్వాతంత్రం వచ్చాక అమెరికాలోలా "లా ఆఫ్ ది లాండ్" కాకుండా, ఒక్కొక్క జాతికీ ఒక్కొక్క మతానికీ వేరు వేరు న్యాయపథకాలు తయారయాయి. కొంతమందికి లా వొక్కంతయు లేకుండా పోయింది. దానితో రకరకా

ల విభజనలు. కోటాలు. అది సాహిత్యంలోకి కూడా వ్యాపించింది.

ఒక తెలుగు కథల పుస్తకాన్ని సమీక్ష చేస్తూ, "ఈ పుస్తకంలో వున్న 38 కథలలోనూ రెండు తెలంగాణా కథలు, ఒకటి రాయలసీమ కథ" అంటాడొక సమీక్షకుడు. మరి గుంటూరువి ఎన్ని కాకనాడవి ఎన్ని పెద్దకూరపాడువి ఎన్ని? తూగో జిల్లాలో పుట్టి, గుంటూరులో పెరిగి, అమెరికా చేరిన రచయితని ఏ ప్రాంతానికి చెందారంటారో ఈ సమీక్షకులు!

అలాగే ఫెమినిజంవి, దళితిజంవి, కమ్యూనిజంవి, నక్సలిజంవి... కోటా సిస్టమ్ అభిమాని అనుకుంటానీ సమీక్షకుడు. ఆయన పేరు శ్రీనివాసరావయితే, ఆయన్ని మనం కోట శ్రీనివాసరావని పిలుచుకోవచ్చు. (చదువరీ! సినిమా నటుడు కోట శ్రీనివాసరావుగారికీ, ఈ "కోటా" గారికీ ఏమి సంబంధం లేదని గ్రహించు)

ఇవన్నీ ఎందుకు రాస్తున్నానంటే, మనిషి జ్ఞాన సంపాదనకి హద్దులుండ కూడదు. ఆ హద్దుల గీతలు గీసుకుని, మడి కట్టుకు కూర్చుంటే, అది అజ్ఞాన సంపాదన అయిపోతుంది. అంతేకాదు ఒక విషయాన్ని సమర్థించటానికి ఎంత జ్ఞానం కావాలో, దాన్ని విమర్శించటానికి కూడా అంతో, అంతకన్నా ఎక్కువో జ్ఞానం కావాలి.

వేరే ఇంకో సందర్భంలో ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్ ఏమన్నాడంటే, నీ స్నేహితులకి దగ్గరగా వుండు. శత్రువులకి ఇంకా బాగా దగ్గరగా వుండు అని.

"నీ కిష్టమైన దాన్ని చదువు. అట్టే దాన్ని ఇంకా బాగా చదువు" అని బహుశా ఇక్కడ దాన్నిలా అన్వయించుకోవచ్చేమో. అలాకాకుండా మన ఇజానికి చెందని మనుష్యుల్నీ, రచనల్నీ, సంస్కృతినీ విమర్శించటం కోసం విమర్శించటం విమర్శ అవదు.

మన రేడియోలో సినిమా పాటలు వింటుంటే, "తర్వాతి పాట కావాలని అడిగినది గుడివాడనించీ గుణసుందరిగారూ, సూళ్ళూరిపేటనించీ సువర్ణసుందరి గారూ, వారి సుందరుడూ...." ఇలా పేర్లు చెబుతుంటారు.

కొన్నాళ్ళు పోతే సినిమా పాటలు వినిపించేటప్పుడు కూడా ఈ కోటా సిష్టమ్ వస్తుందేమో. "మీరు వినబోయే పాట పాడినది చెన్నయ్ బాలు, కేరళ చిత్ర రచన హైద్రాబాద్ సిరివెన్నెల. సంగీతం...." నాకిక్కడో అనుమానం. చెన్నయ్ బాలు, కేరళ చిత్ర, హైద్రాబాద్‌లో ఆ పాట రికార్డ్ చేస్తే, అదే బ్రాండో!

అలాగే మీ (మా) వారపత్రిక దీపావళి సంచికలోని పది కథల్లోనూ, నాలుగు ఆడ కథలూ, ఐదు మగ కథలూ, పదో కథ మాత్రం ఎవరిదో అర్థంకావటం లేదు అని రాస్తారేమో!

అయ్యో! అమ్మో!

ఈ ఇజాలకీ, ఇజాలను సమర్థించే వారికీ నమస్కారం.

కనీసం సాహిత్యాన్ని, నిజంగా విశ్వజనీయంగా బ్రతకనీయండి.

* * *